ఈ-కేవైసీ పరేషాన్!

- పేదలపై కత్తిగట్టిన కూటమి ప్రభుత్వం
- ఈ- కేవైసీ లేకపోతే కార్డులు రద్దవుతాయని ప్రచారం
- ఆందోళనలో కార్డుదారులు



ఈ-కేవైసీ వేయించుకుంటున్న లబ్ధిదారుడు

తాడిపత్రి రూరల్ : ఈ- కేవైసీ పేరు వింటేనే కార్డుదారులు హడలిపోతున్నారు. రేషన్ కార్డులో ఉన్న లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని లేనిపక్షంలో కార్డులు రద్దవుతాయని ప్రచారం జరగడమే ఇందుకు కారణం. తాడిపత్రి నియోజకవర్గంలో రేషన్‌కార్డులకు సంబంధించి మొత్తం 4,40,763 మంది లబ్ధిదారులు ఉండగా ఇందులో 4,03,787 మంది ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారు. ఇంకా 36,976 పెండింగ్‌లో ఉన్నారు.

ఈ- కేవైసీ పెండింగ్ తెలిసేదెలా?

కార్డుదారులకు చాలామందికి ఈ- కేవైసీ పెండింగ్‌లో ఉందన్న విషయమే తెలియదు. వారికి రేషన్ డీలర్లు కానీ, వీర్వోలు కానీ చెప్పడం లేదు. సాధారణంగా ప్రతి డీలర్ ప్రతి నెలా 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రేషన్ దుకాణాలను తెరచి ఉంచాలి. కానీ తాడిపత్రి పట్టణంతోపాటు పరిసర మండలాల్లో తాము కేటాయించుకున్న రోజుల్లో మాత్రమే తెరచి ఉంచి మిగిలిన రోజుల్లో మూసివేస్తున్నారు. దీంతో ఈ- కేవైసీ సమాచారం తెలియడం లేదు. గతంలో కార్డులకు ఈకేవైసీ లేకపోయినా డీలర్లు రేషన్‌ను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఈ- కేవైసీ చేయించుకోని లబ్ధిదారుల జాబితాను రేషన్ డీలర్లు, సచివాలయ వీఆర్వోలకు అందజేశారు. ఈ జాబితా ప్రకారం ఐదేళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వారు ఈ పాసు యంత్రాలపై వేలిముద్రలు వేసి రేషన్ డీలర్ లాగిన్‌లో ఈ-కేవైసీని పూర్తి చేయాల్సి ఉంది.

అగమ్యగోచరంగా వలస కార్మికుల పరిస్థితి

తాడిపత్రి ప్రాంతానికి చెందిన వేలాది మంది చిరు ఉద్యోగులు, కార్మికులు హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలతోపాటు దేశంలోని పలు ప్రాంతాలకు వలస వెళ్లారు. చాలా మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో చదువుతున్నారు. ఇలాంటి వారికి ఈ- కేవైసీ గురించి సమాచారమే తెలియదు. దీంతో చాలామంది ఈ-కేవైసీ చేయించుకోలేదు. ప్రభుత్వం ఈనెలాఖరు వరకూ గడువు పొడిగించినా చాలామంది ఈ-కేవైసీ చేయించుకోలేని పరిస్థితి నెలకొంది.



30లోపు ఈ- కేవైసీ చేయించుకోవాలి



పెండింగ్‌లో ఉన్న కార్డుదారులందరూ తప్పనిసరిగా ఈ నెల30 లోపు ఈ-కేవైసీ వేయించుకోవాలి. రేషన్ డీలర్లు, సచివాలయ వీర్వోలు లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలి. ఈ-కేవైసీ వేయించుకోని కార్డులకు మే నెలలో రేషన్ కోటా బంద్ అయ్యే అవకాశాలున్నాయి.

– రజాక్‌వలి, తహసీల్దార్, తాడిపత్రి

తాడిపత్రి నియోజకవర్గం ఈ- కేవైసీ వివరాలు..

మండలం	మొత్తం లబ్ధిదారులు	ఈ-కేవైసీ పూర్తి	ఈ-కేవైసీ పెండింగ్
తాడిపత్రిఅర్బన్	1,76,244	1,61,836	14,408
తాడిపత్రి రూరల్	1,40,366	1,28,206	12,160
యాడికి	50,276	46,066	4,210
పెద్దవడుగూరు	42,146	38,251	3,895
పెద్దపప్పూరు	31,731	29,428	2,303

క్లుప్తంగా

కార్మిక సమస్యలు పరిష్కరించాలి



రెడ్ రిబ్బన్ ధరించి నిరసన తెలుపుతున్న నాయకులు

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ(నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్) డిపో కార్యదర్శి నటరాజ్, అధ్యక్షుడు ఏఎల్ఎస్.గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఉద్యోగులు రెడ్ రిబ్బన్ ధరించి నిరసన తెలుపుతూనే తమ విధులను కొనసాగించారు. 1-2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్‌లను ఆపాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులను కల్పించాలని కోరారు. అనారోగ్య సెలవులకు పూర్తిజీతం చెల్లించాలని, పాత వైద్యసేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి



డిపో వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు ఆర్టీసీ డిపో వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి మాట్లాడుతూ దాతల సహకారంతో గుంతకల్లు, గుత్తి, పామిడిలో ఆర్టీసీ బస్టాండ్‌లు ఏర్పాటు చేశారన్నారు. అయితే అధికారులు బస్టాండ్ ప్రాంగణాల్లో అద్దె గదులను ఏర్పాటు చేయడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇక గుంతకల్లు నుంచి విజయవాడకు ఒక్క బస్సు కూడా లేదన్నారు. విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, శ్రీశైలం తదితర ప్రాంతాలకు సర్వీసులు ఏర్పాటు చేయడంతోపాటు ఆర్టీసీ బస్టాండ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ, రూరల్ కార్యదర్శులు గోపీనాథ్, రామురాయల్, నాయకులు ఎస్‌ఎండీ గౌస్, దేవేంద్ర, ప్రసాద్, పుల్లయ్య, శివ, చితాంబరం, నందు, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ గౌస్‌బాషా, సేల్ ట్యాక్స్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ సురేంద్రనాథ్‌రెడ్డి, మైన్స్ కార్యాలయంలో ఏడీ ఓబులరెడ్డి త్రైత సిద్ధాంతం యుగాది క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని సచివాలయాలు, ఆయా కళాశాలలు, పాఠశాలల్లో త్రైత సిద్ధాంతం సేవాసమితి సభ్యులు క్యాలెండర్లు పంపిణీ చేశారు.


గుత్తిని కరువు మండలంగా ప్రకటించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గుత్తి/ గుత్తి రూరల్: గుత్తిని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు వారు బుధవారం వారు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతోపాటు తహసీల్దార్ ఓబిలేసుకు వినతిపత్రాలు అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి వి.నిర్మల, నాయకులు కుళ్లాయి, శివ, రేణుక, రేవతి, కవిత, జయమ్మ, అశోక్ మాట్లాడుతూ గుత్తి మండలంలో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు పండక రైతులు, రైతు కూలీలు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారని ఆదుకోవాల్సిన ప్రభుత్వం అనంతపురం జిల్లాలో కేవలం ఏడు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందని అన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గుత్తి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

శాంతిర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

తాడిపత్రిటౌన్(యాడికి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై యాడికిలో ఆ మండలంలోని చర్చిల పాస్టర్లు, సంఘం సభ్యులు బుధవారం శాంతిర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్ నుంచి బైబిల్ మిషన్ చర్చి వరకు ర్యాలీ సాగింది. ప్రవీణ్ పగడాల కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ సోలోమాన్, జాన్ సుధాకర్, రంగారావు, ఏసన్న, అనిల్ జాషువా, చార్లెస్, బెన్నయ్య, పౌలు, ఫిలిప్, ప్రవీణ్‌కుమార్, సుధాకర్, ఈటె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గౌతమేశ్వరాలయంలో రైల్వే చీఫ్ మెకానికల్ ఇంజినీర్



గౌతమేశ్వరాలయాన్ని సందర్శించిన మధుసూదన్ రావు, కుటుంబ సభ్యులు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని అతిపురాతనమైన గౌతమేశ్వరాలయాన్ని బుధవారం దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ మధుసూదన్ రావు, గుత్తి రైల్వే డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, వారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ వారిని సన్మానించారు. గుత్తి కోట క్యాలెండర్లను అందజేశారు.

శ్రీరామనవమి వేడుకలకు తరలిరండి

గుత్తి: కోట వీధిలో వెలసిన అతిపురాతన రామస్వామి ఆలయంలో ఈనెల 6న జరిగే శ్రీరామ నవమి వేడుకలకు భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తెల్లవారు జామును నుంచి రాత్రి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

గుంతకల్లు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంతకల్లు నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, మండలాల కమిటీల జాబితాను పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం విడుదల చేసింది. గుంతకల్లు మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్లుగా మేస్త్రీ హనుమేష్, జింకల నవీన్, జనరల్ సెక్రటరీలుగా సాంబ, వీరన్న, తిమ్మ, సెక్రటరీలుగా శివ, తోగట రాఘవేంద్ర, కరీమ్, జీవీ సూర్యకిరణ్, జాన్, ఈసీ మెంబర్లుగా వడ్డే మోహన్, డీ.హస్సేన్, రాము, మంజుయాదవ్, అంజినయ్య, మద్దిలేటి, కటిక సుబ్బారావును నియమించారు. అలాగే గుంతకల్లు మండల వైస్ ప్రెసిడెట్లుగా బీ.హనుమంతు, హనుమంతురెడ్డి, జనరల్ సెక్రటరీలుగా శివ, భాస్కర్‌రెడ్డి, ఓబులేసు, సెక్రటరీలుగా దశరథ్, పీ.ఆంజి, వెంకటేష్‌నాయక్, జీ.రాఘవ, నగేష్, ఈసీ మెంబర్లుగా కురవ రంగన్న, షేక్షావలి, తిరుమల, యల్లప్ప, గోపాల్‌నాయక్, జగదీష్, కదిరప్పను నియమించినట్లు వివరించారు.

గుత్తి మున్సిపాలిటీ, మండల కమిటీలు...

ఇక గుత్తి మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్లుగా కే.మున్వర్, యం.రంగస్వామి, జనరల్ సెక్రటరీలుగా టీ.రామాంజినేయుల, పీ.గోపీనాథ్‌రెడ్డి, బీ.హరినాథ్‌రెడ్డి, సెక్రటరీలుగా బీ.హరిబాబు, డీ.రామాంజనేయులు, వై.బ్రహ్మేంద్రకుమార్, కే.అన్వర్‌బాషా, డీ.సూర్యప్రకాష్‌ను నియమించారు. ఈసీ మెంబర్లుగా రాజేష్‌కుమార్, ఎస్,మహబుబ్‌బాషా, జీ.రఫీక్‌ఖాన్, మెనుద్దీన్, ఎస్.చంద్రశేఖర్, బీ.రాముడు, నాగారాజును నియమించినట్లు వివరించారు. ఇక గుత్తి మండలం వైస్ ప్రెసిడెంట్లుగా వీరమడుగు బాలరాముడు, రామగిరి రాఘునాథ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా టీ.లక్ష్మీరెడ్డి, మలింగ, ఆవుల వసుదేవరెడ్డి, సెక్రటరీలుగా డీ. ఇబ్రహీమ్, డీ.సంజీవ్, వీ.సుధాకర్, పెనుకొండ బాలరంగయ్య, పీ.సుధాకర్, ఈసీ మెంబర్లుగా ఎస్.వెంకటార్జున, ఎస్.ఓబయ్య, ఎం.సూర్యనారయణ, బోయ నాగరాజు, రామాంజినేయులు, ఎస్.వీరాంజినేయులు, పీ. పుల్లప్పను నియమించినట్లు తెలిపారు.

పామిడి నగర పంచాయతీ, మండల కమిటీలు..

పామిడి నగర పంచాయతీ వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్.నల్లాద్దీన్, ఎం.శివ, సయ్యద్ షేషావలి, జనరల్ సెక్రటరీలుగా ఎం.సుధాకర్, వై.ఖాసీమ్, బాలకృష్ణ, సెక్రటరీలుగా రఘువీరా, కే.బాబ్లు, సుధాకర్‌రెడ్డి, ముంకుదరెడ్డి, బీకే. అన్వర్‌బాషా, ఈసీ మెంబర్లుగా బెస్త వెంకటరాముడు, ఫకృద్దీన్, సూర్యనారాయణ, దస్తగిరి, ఎన్.ప్రకాష్, రామాంజినేయులు, లాలెప్పను నియమించినట్లు తెలిపారు. ఇక పామిడి మండల వైస్ ప్రెసిడెంట్లుగా నీలూరు హరినాథ్‌రెడ్డి, ఉప్పర శంకర్, జనరల్ సెక్రటరీలుగా వీ.రామేశ్వరరెడ్డి, పీ.నగేష్, రామకృష్ణరెడ్డి, సెక్రటరీలుగా నాగేంద్రరెడ్డి, పీ.లక్ష్మన్న, పెన్నోబలేసు, వినోద్‌కుమార్‌రెడ్డి, బీ.ఎర్రిస్వామి, ఈసీ మెంబర్లుగా ఎస్.రామకృష్ణ, ఎన్.శంకర్, బోయ నాగేంద్ర, తలారి బోయ సూరి, బోయ నాగార్జున, బోయ కొప్పలకొండను నియమించినట్లు వివరించారు. పార్టీ బలోపేతానికి కమిటీ సభ్యులు శ్రమించాలని గుంతకల్లు నియోజవకర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఈ సందర్భంగా సూచించారు.

తాడిపత్రిటౌన్(యాడికి): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం యాడికి మండల కమిటీలను నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. యాడికి వైస్ ప్రెసిడెంట్లుగా జె. భాస్కర్‌రెడ్డి, ఎస్ శివశేశవరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా కె.మారుతీకుమార్, ఎం.చిన్న ఆంజనేయులు, వై. బాలగంగయ్య. సీ.అశోక్‌రెడ్డి, సెక్రటరీలుగా ఎం. రసూల్, టీ. ఆదినారాయణ, వై. సుదర్శన్ నియమితులయ్యారు.

తాడిపత్రి మునిసిపాలిటీ..

తాడిపత్రి మునిసిపాలిటీ వైస్ ప్రెసిడెంట్లుగా కేవీ సుబ్బారెడ్డి, పక్కీరప్ప, జనరల్ సెక్రటరీలుగా ఎస్. వెంకటనాగయ్య. సుధీర్‌రెడ్డి, సాయిరాం, హరిక్రిష్ణ ప్రసాద్, సెక్రటరీలుగా క్రిష్ణయ్య, షావలి, మహమ్మద్ ఖాద్రీ నియమితులయ్యారు.

పెద్దపప్పూరు మండలం..

పెద్దపప్పూరు మండల వైస్ ప్రెసిడెంట్లుగా కే. సూర్యనారాయణ, కె. రామాంజులరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా ఎల్. నాగేంద్రరెడ్డి, పి. గోవిందు, వై. రామమోహన్‌రెడ్డి, ఎం ఉస్సేన్‌పీరా, సెక్రటరీలుగా పి.ఉమామహేశ్వరరెడ్డి, టి. బాలనాగన్న, వీ.కే.రామ రంగేశ్వరరెడ్డి నియమితులయ్యారు.

పెద్దవడుగూరు మండలం..

పెద్దవడుగూరు మండల వైస్ ప్రెసిడెంట్లుగా ఆర్.హరికృష్ణారెడ్డి, ఆర్. జ్ఞానేశ్వర్, జనరల్ సెక్రెటరీలు గా బి.మహేశ్వరరెడ్డి, పి.గోపీనాథ్‌రెడ్డి, ఎస్.రాఘవేంద్ర, బి.నాగిరెడ్డి, సెక్రెటరీలుగా జి.సోమశేఖర్‌రెడ్డి, పి.శ్రీరాములు, టీ.ఈశ్వరయ్య నియమితులయ్యారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత



ఎన్‌సీసీ విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఈఓ కే వాణి



ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కళాశాల డైరెక్టర్ గోపాల్

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవాల్లో సేవలు అందించిన ఎన్‌సీసీ విద్యార్థులకు బుధవారం ఆలయ ఈఓ కే.వాణి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు అద్భుతంగా సేవలు అందించారని ఈఓ అభినందించారు.

సామాజిక సేవ బాధ్యతగా తీసుకోవాలి

గుంతకల్లు: ప్రతి విద్యార్థి సామాజిక సేవను బాధ్యతగా తీసుకోవాలని శ్రీశంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాల డైరెక్టర్ గోపాల్ పేర్కొన్నారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఉగాది ఉత్సవాల్లో కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు సేవలు అందించారు. బుధవారం ఆయన వారికి కళాశాలలో ప్రశంసాపత్రాలు అందజేశారు. మొత్తం 30 విద్యార్థులు భక్తులకు సేవలందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రకాష్, మహిళ విభాగం ఆఫీసర్ లాస్య, ఆధ్యాపకులు బసెట్టి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రామగిరి ఎగువతండాలో పారిశుధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..



తండాలో డ్రైనేజీ పూడిక తీయిస్తున్న దృశ్యం

పామిడి: రామగిరి ఎగువతండాలో బుధవారం అధికారులు పారిశుధ్య పనులు చేయించారు. 'తండాలో సమస్యల తిష్ట' శీర్షికన బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ కే తేజోత్స్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిరుపాల్ నాయక్, పంచాయితీ సెక్రటరీ దేవేంద్ర ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందిని తండాకు పంపారు. ఈసందర్భంగా వారు తండాలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయించారు. రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీటిని తొలగించారు. ట్యాంకు, కుళాయిలకు ఉన్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీటి సమస్య పరిష్కరించారు. ఈ సందర్భంగా తండావాసులు సమస్యలు పరిష్కరించిన అధికారులతోపాటు సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు





తీవ్రంగా గాయపడిన శ్యామ్, వీరన్న

గుత్తి రూరల్: రజాపురం గ్రామ శివారులో బుధవారం ద్విచక్రవాహనం నుంచి కిందపడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంతకల్లుకు చెందిన శ్యామ్, వీరన్న గుత్తిలో పని ముగించుకొని తిరిగి గుంతకల్లుకు బయలుదేరారు. రజాపురం గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న వారి ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్యామ్, వీరన్నను స్థానికులు 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బసినేపల్లిలో ఒకరికి..

బసినేపల్లి గ్రామ శివారులో ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు..బసినేపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు బుధవారం గ్రామ శివారులో ఉన్న హోటల్ వద్ద పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామాంజనేయులును వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అశ్వత్థంలో ఏఎస్పీ ప్రత్యేక పూజలు



ఆలయ సిబ్బందితో ఏఎస్పీ రోహిత్‌కుమార్ దంపతులు

పెద్దపప్పూరు: చిన్నపప్పూరులో వెలసిన అశ్వత్థనారాయణస్వామి ఆలయంలో బుధవారం తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు, అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్థలపురాణం, ఆలయ విశిష్టతను ఏఎస్పీకి తెలియజేశారు.

ఘనంగా పెద్దమ్మ జాతర

గుత్తి రూరల్: బేతాపల్లిలో బుధవారం పెద్దమ్మ ఊరు జాతర ఘనంగా జరిగింది. గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో వేకువజాము నుంచి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, ఆకుపూజ, అర్చనలు చేశారు. గ్రామంలోని మహిళలు ప్రతి ఇంటి నుంచి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. పెద్ద ఎత్తున జంతుబలి ఇచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో జరిగిన పెద్దమ్మ ఊరు జాతరకు వైఎస్సార్‌సీపీ నేత, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరా, యువ నాయకుడు చిన్నబాబు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యం

రాప్తాడురూరల్: సిండికేట్‌నగర్‌కు చెందిన సూర్యప్రతాప్‌రెడ్డి రెండు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. కట్టకిందపల్లికి చెందిన సూర్యప్రతాప్‌రెడ్డి సిండికేట్‌నగర్‌లో స్థిరపడ్డాడు. ఓ మెడికల్ స్టోర్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ట్యూషన్‌కు వెళ్లిన పిల్లలను పిలుచుకొస్తానని ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. మొబైల్ కూడా స్విచ్ఛాఫ్ చేశాడు. బుధవారం భార్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రాజా బావి సంప్రోక్షణ

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న రాజా బావిలో బుధవారం వేద పండితులు, ఆయా ఆలయాల పూజారులు సంప్రోక్షణ(శుద్ధి కార్యక్రమం) నిర్వహించారు. గత ఫిబ్రవరి మాసంలో టెన్త్ విద్యార్థి వీరాచారి రాజా బావిలో ఈతకు వెళ్లి మృతి చెందిన విషయం తెలిసిందే. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు బావిలో సంప్రోక్షణ నిర్వహించారు.

ఉల్లాసంగా తిక్కయ్యస్వామి ఉట్ల పరుష

నార్పల: మండల కేంద్రంలోని తిక్కయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఉట్లపరుష కార్యక్రమం ఉల్లాసంగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే తిక్కయ్యస్వామి ఆలయం వద్ద ఏటా ఉగాది అనంతరం ఉట్లపరుష నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం నుంచి తిక్కయ్య స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం 3 గంటల అనంతరం టెంకాయ కొట్టు, ఉట్లమాను ఎక్కే పందెం నిర్వహించారు. అనంతరం కోలాటాలు, భజనలు జరిగాయి. చివరగా స్వామి వారి ఉత్సవ విగ్రహ ఊరేగింపుతో కార్యక్రమాన్ని ముగించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఉట్ల పందెం గెలిచిన వారికి బహుమతులు అందించారు. పలువురు దాతలు భక్తులకు పలువురు మజ్జిగ, తాగునీటిని సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు మన్నీల సుప్రియ, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, బాలనాగి శీనా, గవ్వల సుబ్బయ్య, చికెన్ గోపాల్ పాల్గొన్నారు.



ఉట్ల వేడుకను తిలకిస్తున్న జనం (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో తిక్కయ్యస్వామి

ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రవేశాలకు గడువు పొడిగింపు


గార్లదిన్నె: ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 6 వరకు గడువు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులునాయక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 5వతరగతితో పాటు 6,7,8 తరగతుల్లో ఖాళీల భర్తీ కోసం ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీట్లను ఏపీఆర్‌జేసీ సెట్ ద్వారా భర్తీ చేస్తారన్నారు.

దొంగ అరెస్ట్

తాడిపత్రిటౌన్(యాడికి): యాడికి సాయిబాబా గుడిలో వారం రోజుల క్రితం ఆలయ వస్తువులు అపహరించిన దొంగను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. చైతన్య హిల్స్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న యాడికి గ్రామానికి చెందిన గొడ్డుమర్రి రామాంజనేయులను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ తానే చేసినట్లు అంగీకరించాడు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సమస్యల పరిష్కారానికే 'ప్రజా దర్బార్'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

గార్లదిన్నె: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణి పేర్కొన్నారు. బుధవారం గార్లదిన్నె సచివాలయం వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొందరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

నేడు 'మీమాటే ముఖ్యం'

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం మీ మాటే ముఖ్యం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ రోహిత్ కుమార్‌చౌదరి బుధవారం తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలు అర్జీల రూపంలో తమ సమస్యలు తెలియజేయవచ్చని ఆయన సూచించారు.

విద్యుత్ కేబుల్ చోరీ

గుంతకల్లు రూరల్: నక్కనదొడ్డి తండ్రా సమీపంలోని రైతుల పొలాల్లో వ్యవసాయ మోటర్ల విద్యుత్ కేబుల్ మంగళవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. రైతులు రాముడు నాయక్, నాగరాజు, జయరామ్ నాయక్, దుర్గ నాయక్, క్రిష్ణానాయక్, చెన్న బాషయ్య, బాల, రాఘవేంద్ర అనే రైతుల పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. ఈ రైతులకు సంబంధించిన స్టార్టర్ వద్ద నుంచి మోటర్ వరకూ ఏర్పాటు చేసిన విద్యుత్ కేబుల్‌ను కత్తిరించుకెళ్లారు. ఒక్కో రైతుకు చెందిన దాదాపు 30 మీటర్ల కేబుల్‌ను కత్తిరించుకెళ్లారని, దాదాపు రూ.50 వేల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.